


## అంకితం

నా జీవితం నీకంకితం అంటాడు ప్రేమికుడు కొత్త రోజుల్లో. ఇది కవిత్వమేగాని కాని పని. ఇంటికి ఆలస్యంగా వచ్చే భర్తని ఆఫీసు ఫైళ్ళకి అంకితమైపోయేరని సాధిస్తుంది ఇల్లాలు. కొందరు పేకాటకి అంకితమైపోతారు. మరికొందరు బ్రాందీ, విస్కీలకు అంకితమవుతారు. కొందరేమో గుర్రప్పందేలకు అంకితమైతే ఇంకొందరు బ్రాకెట్ ఆటకి అంకితమవుతారు. కొందరు దేనికీ కాకుండా పోతారు.

అంకితమనేమాటకి అర్థం అంకితమనే చెప్పుకుంటే బెటరు. సాగలాగితే డొంక తిరుగుడు అర్థమేదో వస్తుందేగాని అదంత కళాత్మకంగా వుండదు. పరమ సరసంగా వుంటుంది. అందుచేత, అంకితాన్ని అంకితంగానే

చెప్పుకుందాం. పూర్వం పోతనగారు భాగవతం రాస్తే అది తనకి అంకిత మివ్వమని రాజుగారు మొండిపట్టు పట్టేరు. పోతన గారు ఛీ పొమ్మన్నారు. కన్నెపిల్ల లాటి తన కావ్యాన్ని రాజులకిచ్చి ధనరాసులు సంపాయించుకోడం పడుపు వృత్తితో సమానమన్నాడు. అలాంటి నికృష్టపు తిండి తినే కంటే సత్కవులు పొలం దున్నుకుంటూనో, అడవుల్లో దుంపలు తింటూనో, బతకడం మేలని కోప్పడ్డాడు. అవి పుణ్యకాలం రోజులు. కవులకు గిరాకీ ఎక్కువ. రాజ్యంలో ఒకరో ఇద్దరో వుండేవారు. అగ్రహారాలిచ్చి వాళ్ళని కొనేద్దామనే యావ ప్రభువులకుండేది. తమని కొనుక్కుంటే బావుండునని కవులు ఎదురు చూసేవారు. అల్లాంటి పుణ్యకాలంలోనే పోతన ఎదురు తిరిగేడంటే గురువుగారికి చేతులెత్తి మొక్కాలి.

ఇప్పుడు రాజుల్లేరు. ఉన్నా ప్రత్యేకించి మన పుస్తకాలే అడుగుతారన్న గ్యారంటీ అంతకంటేలేదు. వీధికో రచయిత, పేటకో కవి వెలిసిన ఈ రోజుల్లో ఎవడి పుస్తకం చదవాలో, ఎవడి పుస్తకాన్ని తలకింద పెట్టుకుని నిద్రపోవాలో చెప్పడం కష్టం. అంచేత అంకితం అడిగే నాథులు తక్కువ. మనకు మనమే అంకితమిస్తే పుచ్చుకుంటారేమో గాని నీది నాక్కావాలనే డిమేండు ఈ రోజుల్లో లేదు.

పూర్వం కవులకు అగ్రహారాలుండేవని వినికిడి. ఈ రోజుల్లో సొంతానికి కొంప కట్టించుకోవడం కాదు గదా, తాతలిచ్చిన కొంప నిలబెట్టుకోడమే కష్టంగా వుంది. రోజు గడిస్తే చాలనుకుంటున్నాం. దరిద్రం నేపథ్యంగా రచయిత అల్లాడి పోతున్నాడు. కిరాణా కొట్టులో బాకీపడ్డ వందో, రెండొందలో సర్దుకోవాలంటే యమయాతనగా వుంటోంది. నన్నొదిలేయండి బాబో, డబ్బివ్వలేనుగానీ అంకితమిస్తానంటే షాపుకారు మన కాలరట్టు కుంటాడు. మన పుస్తకాలు చింతపండు పొట్లాల కుపయోగిస్తున్నట్టు అతనితో పాటు మనకు కూడా తెలుసు. కనీసం ఆ పవిత్ర కార్యానికైనా మన పుస్తకా లుపయోగపడుతున్నందుకు మనం గర్వించాలే తప్ప ఇతరత్రా కోరికలు పెంచుకోకూడదు.

మా ఫ్రెండొకడు తన పుస్తకాన్ని సైకిల్ షాపు యజమానికి అంకితం యిచ్చేడు. అంకితం పేజీలో ఆ షాపతని ఫొటోవేసి గాలి కొట్టేడు. కళాహృదయం అతని సొత్తన్నాడు. కేవలం సాధువర్తనుడన్నాడు. స్నేహపాత్రుడన్నాడు. సాహితీవేత్తన్నాడు. కథలూ, కాకరకాయలంటే ప్రాణాలిస్తాడన్నాడు. ఫొటో చూస్తేఎందుకో నమ్మబుద్ధి కాలేదు. ఆరాతీస్తే ఆ షాపతను మూడో తరగతితో చదువాపి సైకిలు షాపులో చేరినట్లు తెలిసింది. దరిమిలా యజమాని అంతస్థుకి ఎదిగినట్టు తేలింది. అట్లాంటి శాల్తీకి మా ఫ్రెండు తన పుస్తకాన్ని ఎందుకు అంకిత మిచ్చాడో మీరు ఊహించలేరు. మా ఫ్రెండుకొడుక్కి సైకిలుంది. ఆ షాపులోనే రిపేరు చేయించుకుంటాడు. జీవితాంతం ఫ్రీ సర్వీసు ఒప్పందంతో ఇట్లాంటి ఏర్పాటు చేసుకున్నాడని తెలిసి నేనెంతో ఆనందించేను.

పుస్తకాలు రాసి పబ్లిషరు కిచ్చి, ఆ పబ్లిషరు చేత ఇంటిఅద్దె కట్టించే రచయితలున్నారు. బియ్యం కొట్టు చలమయ్య గారికి మూడు పుస్తకాలు అంకితమిచ్చి నెలకో బస్తా చొప్పున ఏడాది పాటు లాగించే నాటక కర్తలున్నారు. నా కలల రాణి, నా వలపుల పంట అంటూ మధురవాణి బ్రాండుకి అంకితమిచ్చి రాత్రి సుఖాన్ని ఖర్చు లేకుండా సరిచేసే సరస రచయితలూ వున్నారు. భార్య తరపు పెద్దలందరికీ తలో పుస్తకమిచ్చి తరించిన భార్యావిధేయులున్నారు. భద్రగిరి శ్రీరామచంద్రుల పాదారవిందాలకు భక్తితో అంకితమనే పోతన మార్కు రచయితలు కూడా వున్నారేగాని వాళ్ళు పోతనలు మాత్రంకాదు. అందుచేత ఈ జాతి రచయితలందరికీ వందనాలని చేతులు జోడించడమే తక్షణ కర్తవ్యం.